



అమ్మకు బోనం.. భక్తిపారవశ్యం

సిద్దిపేట పట్టణంలో పలుచోట్ల బోనాల సందడి నెలకొన్నది. లాల్ కమాన్, మహమ్మాయమ్మ ఆలయం, కేసీఆర్ నగర్‌తో పాటు పలుచోట్ల పట్టణవాసులు శనివారం బోనాలు సమర్పించారు. లాల్ కమాన్ నుంచి మహమ్మాయమ్మ ఆలయం వరకు భక్తులు బోనాలతో తరలి రాగా పోతరాజుల నృత్యాలతో హోరెత్తింది. అమ్మవారికి భక్తితో బోనం సమర్పించి చల్లగా చూడు తల్లి అని వేడుకున్నారు.

- సిద్దిపేట కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి)

నిరాశ్రయులకు ఆదరణ

- హెచ్ఐవీ బాధితులు, అభాగ్యులకు అండగా నిలుస్తున్న సేవా సంస్థ 7
- దాతల సహకారం లేకున్నా చేయూత

సండే స్పెషల్



అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు

- అధికారుల నిర్లక్ష్యం.. చెత్తశుద్ధిలో అలసత్వం 8
- ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో 20 షెడ్లు వినియోగానికి దూరం

కేంద్రం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తోంది

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి 7

ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేద ప్రజల నిరీక్షణకు ఇక తెరపడనున్నది. కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి రేషన్ కార్డుల జారీ ప్రక్రియను అట్టహాసంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 19,645 నూతన కార్డులకు మోక్షం లభించనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన అనంతరం నాలుగైదు రోజుల్లో నూతనంగా మంజూరైన వారికి రేషన్‌కార్డులు అందించేందుకు అధికారులు సమయాత్తమవుతున్నారు.



కొత్త రేషన్‌కార్డులు వచ్చేస్తున్నాయి

జిల్లాలో రేషన్ దుకాణాలు	686
గతంలో రేషన్‌కార్డులు	2,98,985
బియ్యం పంపిణీ (మె.ట.లో)	6095.48
కొత్తగా మంజూరైన కార్డులు	19,645
మొత్తంగా రేషన్‌కార్డులు	3,18,630
కొత్తగా చేరిన సంఖ్య	74,551

14న జారీ ప్రక్రియ ప్రారంభం
సెప్టెంబరు నుంచి బియ్యం పంపిణీ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 12 : సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 3,18,630 రేషన్‌కార్డులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నాటికి 2,91,374 రేషన్ కార్డులున్నాయి. ఈ మేరకు ప్రజాపాలనలో భాగంగా నూతనంగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడంతో అందులో తొలుత మే, జూన్ నెలలో ప్రభుత్వం 8 వేల మేరకు రేషన్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో రేషన్‌కార్డుల సంఖ్య 2,98,985కు చేరుకున్నది. వీరికి ప్రజా పంపిణీ వ్యవస్థ దుకాణాల నుంచి ప్రతీనెల 6095.48 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నది. వీటితో పాటు ప్రజాపాలనలో భాగంగా నూతనంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు జిల్లాలో 19,645 రేషన్‌కార్డులకు ఆమోదముద్ర వేశారు. తొలుత అందించిన 8 వేల కార్డులు, మిగతా 19,645తో కలిపితే మొత్తంగా 27,645 నూతనంగా రేషనకార్డుదారులుగా అధికారులు ప్రకటించారు.



మార్పులు, చేర్పులతో 74,551 మంది

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో నూతనంగా రేషన్‌కార్డులతో పాటు, పాత రేషన్‌కార్డుకు సంబంధించి కుటుంబసభ్యుల వివరాలు, పేర్లు ఇతరవాటి కోసం మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఆ రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవడంతో 74,551 మందిని పాత కార్డుల్లోకి పేర్లు జతకావడంతో వారందరికీ లబ్ధి చేకూరనుంది. వీరితో పాటు, నూతనంగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన నిరుపేద ప్రజలకు రేషన్‌కార్డులను అందించనున్నారు. దీంతో వీరందరికి సెప్టెంబరు నుంచి ప్రజా పంపిణీ దుకాణాల్లో బియ్యం అందించనున్నారు. ప్రస్తుతం పాత రేషన్ కార్డుదారులకు బియ్యం అందిస్తుండగా, కొత్తగా కార్డు పొందిన వారికి కోటాను పెంచి బియ్యాన్ని అందించనున్నారు.

మూడు నెలలకు 17,013 మెట్రిక్ టన్నులు

జూన్, జూలై, ఆగస్టు (మూడు నెలలు) వరకు సిద్దిపేట జిల్లాలోని 2,98,985 కార్డుదారులకు ప్రభుత్వం 18,286.46 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని రేషన్‌కార్డుదారులకు అందించాల్సి ఉంది. కాగా, 17,013 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసింది. జిల్లాలో పెరిగిన కార్డులకు అణుగుణంగా సెప్టెంబరు నెల నుంచి ఆయా రేషన్ డీలర్ల నుంచి సన్న బియ్యం కోటాను పెంచడంతో పాటు, డీలర్లను కూడా పెంచే ఆలోచనలో అధికారులున్నారు. ప్రస్తుతం జిల్లాలో 686 రేషన్ దుకాణల ద్వారా ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. దాదాపు మరో 6 వేలకుపైగా యూనిట్లు పెరగడంతో ఆ మేరకు బియ్యాన్ని అందించాల్సి ఉంటుంది.

ఎస్టీ హాస్టల్‌కు దిక్కెవరు?

- శిథిలావస్థకు చేరిన భవనం
- గజ్వేల్‌లో ఖాళీ భవనాలున్నా మార్చడం లేదు

గజ్వేల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఎస్టీ హాస్టల్ దుస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పట్టణం చివరన, పెద్దగా జనసంచారం లేని ప్రాంతంలో ఉన్న ఈ హాస్టల్‌ను పట్టించుకునే వారే కరువయ్యారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో పాములు, ఇతర విషకీటకాలు లోపలికి వస్తూ విద్యార్థులను భయపెడుతున్నాయి.

వేధిస్తున్న సమస్యలు

హాస్టల్ భవనం లీకేజీలతో వర్షం పడినప్పుడు నీరు లోపలికి వస్తుండటంతో, వార్డెన్ తన సొంత డబ్బులతో మరమ్మతులు చేయిస్తున్నారు. 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న చిన్నారులు ఇక్కడ ఉంటున్నారు. వారికి అవసరమైన కనీస సౌకర్యాలు లేకపోవడంతో వార్డెన్‌తో పాటు సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఎడ్యుకేషన్ హబ్‌లోని అన్ని హంగులున్న కొత్త భవనాలకు మార్చింది. అయితే ఈ చిన్న పిల్లల ఎస్టీ హాస్టల్‌పై మాత్రం దృష్టి పెట్టలేదని విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం హాస్టల్‌లో 41 మంది విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది 20 మంది మాత్రమే ఉండగా, ఈ ఏడాది మరో 20 మందికి పైగా చేరడంతో మౌలిక సదుపాయాల లేమి మరింత వేధిస్తోంది.ప్రహరీ నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరైనా, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. గజ్వేల్ పట్టణంలో పాత ఎంఈవో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం వంటి పలు ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నప్పటికీ, గిరిజన హాస్టల్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని లేదా హాస్టల్‌ను ఇతర అనువైన భవనంలోకి మార్చాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులను వారు వేడుకుంటున్నారు.



కూలిపోయిన హాస్టల్ ప్రహరీ

బాలికల వసతి గృహంలో నీటి కష్టాలు

గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లో విద్యార్థినుల అవస్థలు






బకెట్ ద్వారా నీటిని వసతి గృహంలోకి తీసుకెళ్తున్న విద్యార్థులు

గజ్వేల్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్‌లో ఉన్న బాలికల వసతి గృహంలో నీటి సమస్య తీవ్రంగా మారింది. కొంతకాలంగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో, బయటి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పిస్తున్నారు. అధికారులు ఈ సమస్యను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో కళాశాలలు ప్రారంభమైనప్పటి నుంచి వసతి గృహంలో నీటి ఎద్దడి నెలకొందని విద్యార్థినులు వాపోతున్నారు. ఇదే కాకుండా, వసతి గృహం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో దోమల బెడద అధికమైందని, ఇది తమ ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందనిఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజుల క్రితం ఎడ్యుకేషన్ హబ్‌లో కొత్త బోరు వేశారని, దీనిని నుంచి సంప్‌లోకి నీరు వెళ్లేందుకు కనెక్షన్ లేకపోవడంతో నీటి సమస్య తీరడం లేదని విద్యార్థినులు పేర్కొన్నారు.

తపాస్‌పల్లిపై ఆశలు

- దేవాదుల నుంచి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల పంపింగ్
- తాజాగా నిలిపి వేయడంతో చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ఆందోళన
- రిజర్వాయర్ నింపాలని, చెరువులకు నీరివ్వాలని అన్నదాతల వేడుకోలు



తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నిలిచిపోయిన నీటి పంపింగ్

చేర్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వరుణ దేవుడు కరుణించకపోవడం, దీనికి తోడు తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు దేవాదుల నుంచి గోదావరి జలాల పంపింగ్‌ను నిలిపివేయడంతో చేర్యాల, కొమురవెల్లి మండలాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంపింగ్ నిలిచిపోవడంతో సాగునీటి కష్టాలు ఎదురవుతాయని లబోదిబోమంటున్నారు.

గోదావరి జలాలే దిక్కు

చేర్యాల మండలంలో 700 ఎకరాల్లో మొక్కజొన్న, 9 వేల ఎకరాల్లో వరి, 9,500 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. కొమురవెల్లి మండలంలో 5 వేల ఎకరాల్లో వరి, 15 ఎకరాల్లో మొక్కజొన్న, 1200 ఎకరాల్లో పత్తి, 10 ఎకరాల్లో కంది సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రోహిణి కార్తెలో వేసిన పత్తి విత్తనాలు వర్షాలు లేక ఎండిపోవడంతో రెండోసారి విత్తనాలు వేశారు. అయినా ఆశించిన వర్షాలు కురవకపోవడంతో పత్తి మొక్కలు వాడిపోతున్నాయి. నారుమడుల్లో నారు ముదిరిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాట్లు వేయడానికి, పత్తి, ఇతర పంటలకు జీవం పోయడానికి గోదావరి జలాలే దిక్కు. రైతన్నలు తపాస్‌పల్లి రిజర్వాయర్‌పైనే ఆశలు పెట్టుకున్నారు.

ఊరించి..ఉసూరుమనిపించి

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గోదావరి నదిలో ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ జలాలు తమకు వరంగా నిలుస్తాయని రైతులు ఆశించారు. పంపింగ్‌కు అవసరమైనంత నీటి లభ్యత ఉండటంతో ఇటీవల మోటార్లు ప్రారంభించారు. దేవాదుల నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి 12 రోజులుగా నీరు చేరింది. ముందస్తుగా ఫేజ్-2 పంప్ ద్వారా పంపింగ్ ప్రారంభించగా, మరుసటి రోజున ఫేజ్-1 పంప్‌ను కూడా ప్రారంభించడంతో రెండు పైపుల ద్వారా కొంతమేర నీరు రిజర్వాయర్‌కు చేరింది. అయితే, శనివారం అర్ధాంతరంగా రెండు పంపులను నిలిపివేయడంతో రైతులు షాక్‌కు గురయ్యారు. గతంలో రిజర్వాయర్‌ను నింపినా, చెరువులకు నీటిని మళ్లించకుండా తరలించిన పరిస్థితులు ఉండటంతో, ప్రస్తుత సీజన్‌లోనైనా కాలువల ద్వారా తమ చెరువులకు నీటిని మళ్లిస్తారా లేక పంపింగ్ పేరుతో ఊరించి ఉసూరుమనిపిస్తారా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పంపింగ్ నిలిపివేతతో పాటు సాగునీరు అందించే విషయంలోనూ స్పందించాలని, దేవాదుల అధికారులకు తగు సూచనలిచ్చి పంటలను కాపాడే ప్రయత్నం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

నాలుగు ఆలయాలకు రూ.1.48 కోట్లు మంజూరు
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం/సిద్దిపేట కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే పెద్దపీట వేశామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆలయాలకు నిధుల మంజూరు కాగా, ఎమ్మెల్యే క్యాంపు కార్యక్రమంలో మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో అనేక ఆలయాలు అభివృద్ధి చేసుకున్నామని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని నాలుగు ఆలయాలకు రూ.1.48 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపి, ప్లాన్‌లు, ఎస్టిమేట్‌లు వేసి ఆమోదం పొందినట్లు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వంపై, మంత్రిపై ఒత్తిడి తెచ్చి ఈ నిధులు మంజూరు చేయించామని చెప్పారు. గత ప్రభుత్వం ఆలయాలకు పూర్వ వైభవం తెచ్చిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినా ఒక్క కొత్త ఆలయానికి కూడా నిధులు ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. రాజ్‌గోపాల్‌పేట శివాలయానికి రూ.35 లక్షలు, అనంతసాగర్ బీరప్ప టెంపుల్‌కు రూ.32 లక్షలు, రాఘవాపూర్ సీతారామచంద్రస్వామి టెంపుల్‌కు రూ.36 లక్షలు, రావూరుకుల వెంకటేశ్వరస్వామి ఆలయంకు రూ.59 లక్షల చొప్పున మంజూరైనట్లు తెలిపారు.

దేశానికే ఆదర్శం సిద్దిపేట కేసీఆర్‌నగర్

సిద్దిపేటలోని కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద నిర్వహించిన బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాల్లో, సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన గురుపూజోత్సవంలో పాల్గొన్నారు. తన సొంత ఇల్లు కట్టుకుంటే ఎంత శ్రద్ధతో కట్టిస్తానో, అంతకంటే ఎక్కువ శ్రద్ధతో కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టారని అన్నారు. మనిషికి దైవస్మరణ, గురుపూజలో ఉండే సంతృప్తి, ఆనందం మరెందులో ఉండవని హరీశ్‌రావు అన్నారు. కోటి హనుమాన్ చాలీసా పారాయణం సిద్దిపేట నుంచి ప్రారంభం కావడం సంతోషంగా ఉందని, ఈ గొప్ప కార్యక్రమంలో అందరం భాగస్వామ్యం అవుదామని పిలుపునిచ్చారు. కొంతమంది కొన్ని సాధించడానికి జన్మిస్తారని, అలాంటివారిలో దుర్గాప్రసాద్ స్వామీజీ ఒకరని కొనియాడారు.



మంజూరు పత్రాలను అందజేస్తున్న హరీశ్‌రావు

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

- సిద్దిపేటలో జాతీయ స్థాయి పోటీలకు హామీ
- మాజీ మంత్రి హరీశ్‌రావు 7

విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులు మృతి



చాకలి మాన్యయ్య, వెంకటేశ్ (ఫైల్)

కొండాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇంటిపైకి బోరు పైపులు ఎక్కిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి తండ్రీకొడుకులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన చాకలి మాన్యయ్యకు, భార్య మంజుల, కొడుకు వెంకటేశ్ ఉన్నారు. పదో తరగతి వరకు చదివిన వెంకటేశ్ తండ్రి వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటాడు. వారికున్న రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శనివారం ఉదయం మాన్యయ్య(46) అతని కొడుకు సహాయంతో ఇనుప పైపులను ఇంటిపై గోడకు నిటారుగా నిలబెట్టేందుకు తండ్రీకొడుకులు కలిసి ప్రయత్నించారు. ఈ క్రమంలో 11 కేవీ విద్యుత్ వైర్‌కు పైపులు తగిలి, తండ్రీకొడుకులకు ఒక్కసారిగా షాక్ కొట్టింది. దీంతో ఇద్దరు ఇంటిపైనే కుప్పకూలారు. వెంటనే స్థానికులు సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు డాకర్లు వెల్లడించారు. ఒకే రోజు భర్త, చేతికి అందిన కొడుకు చనిపోవడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

ఐసీయూలో గడిపెద్దాపూర్ పీహెచ్‌సీ..!

- డాక్టర్ గదితో పాటు మరుగుదొడ్లు వరకు అన్ని క్లోజ్
- ఏ క్షణాన కూలుతుందో అన్న భయం
- హోమియోపతి వైద్యశాలలోని ఓ గదిలో వైద్య పరీక్షల నిర్వహణ

అల్లాదుర్గం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రిలకు దీటుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్యసదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం ఆశ పడుతుంటే కానీ కొందరు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హోమియోపతి ఆసుపత్రిలో అరకొర వసతులతో ఉన్న ఓ గదిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దుస్థితి నెలకొంది. 2022 అక్టోబరు 19న ఈ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ ఆసుపత్రికి అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల నుంచి నిత్యం 60-75 మంది రోగులు వైద్య పరీక్షల కోసం ఈ ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారని వైద్య సిబ్బంది తెలిపారు. అయితే ఈ ఆసుపత్రి గత కొన్నాళ్లుగా శిథిలావస్థలో ఉంది. ప్రభుత్వం పలు మార్లు నిధులు మంజూరు చేసినప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మకై తూతూ మంత్రంగా పనులు చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో ఆసుపత్రి పైకప్పు వర్షం నీటితో తడుస్తూ పెచ్చులూడిపోతుండటంతో వైద్యధికారులు భయాందోళన చెందుతూ ఆసుపత్రిలోని డాక్టర్ గదితో పాటు పేషంట్లకు సంబంధించిన గది, చివరకు మరుగుదొడ్లు కూడ మూసి వేశారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న హోమియోపతి ఆసుపత్రిలోని ఓ గదిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. రెండు ఆసుపత్రుల నిర్వహణ ఒకే గదిలో ఎలా కొనసాగుతుందని స్థానికులు వాపోతున్నారు.

జిల్లా అధికారుల ఆదేశాలతోనే..

ఆసుపత్రి భవనం గురించి జిల్లా అధికారులకు విన్నవించాం. వైద్యాధికారులు ఈ దుస్థితిని పరిశీలించి పక్కనే ఉన్న హోమియోపతి ఆసుపత్రిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహింపచేయాలని ఆదేశించారు. దీంతో ఆసుపత్రిలోని గదులన్నీ క్లోజ్ చేసి ఈ గదిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహి ంపచేస్తున్నాం.

-డాక్టర్.అశ్విని

డయేరియా బాధితులు ఆసుపత్రిలో చేరితే ఎలా...

మరుగుదొడ్లు కూడా మూసివేయడం వల్ల వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతూ ఈ ఆసుపత్రిలో చేరితే వారి పరిస్థితి ఏమిటంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను కూడా ప్రైవేట్ ఆసుపత్రుల తరహాలో తీర్చి దిద్ది, కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందిస్తామని చెప్తున్న ప్రభుత్వం ఇలా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్న ఆస్పత్రులను ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆసుపత్రి భవనం మరమ్మతు పనుల కోసం నిధులు మంజూరు చేసి ఈ ప్రాంత రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



గడిపెద్దాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ హొమియోపతి వైద్యశాల



డాక్టర్ గదికి క్లోజ్ బోర్డు

అంతర్రాష్ట్ర కాపర్ దొంగల ముఠా అరెస్ట్

272 కేజీల కాపర్ వైర్, రూ.3,24,700ల నగదు , మోటారు సైకిల్ స్వాధీనం

సిద్దిపేట క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా, ఇతర జిల్లాలోని గ్రామాలలో తిరుగుతూ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్ దొంగలించిన అంతర్ రాష్ట్ర నేరస్థులను కుకునూరుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సీపీ డాక్టర్ బి. అనురాధ శనివారం కమిషనర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జూన్ 27న కొండపాక మండల కేంద్రంలో ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్ దొంగలించి రైతులను బాగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఈ దరఖాస్తు ఇచ్చారు . పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ అజారుద్దీన్, మహ్మద్ షాకీర్ , తేలిం ఖాన్ , సలీం, అక్రమ్ ఐదుగురు కలసి కొన్ని నెలల నుంచి గ్రామాలలో తిరుగుతూ ఎక్కడెక్కడ కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయో కనుక్కొని వాటిని గమనించి రాత్రి సమయాలలో వాటిని పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్ దొంగలించి అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తారు. నిందితులు సిద్దిపేట జిల్లాలో వివిధ గ్రామాలలో మొత్తం 19 ట్రాన్సార్మలు పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ను , మెదక్ జిల్లాలో వివిధ గ్రామాలలో 34 ట్రాన్స్‌పార్మర్లు పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ను, కరీంనగర్ జిల్లాలో వివిధ గ్రామాలలో 34 ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ను, వరంగల్ జిల్లాలో వివిధ గ్రామాలలో 63 ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ను , రాచకొండ కమిషనరేట్ పరిధిలో వివిధ గ్రామాలలో 40 ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ను ,సైబరాబాద్ పరిధిలో వివిధ గ్రామాలలో 2 ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ను, పెద్దపల్లి జిల్లాలో ఒక గ్రామంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్‌ను దొంగలించారు. ఈ ఐదుగురు నిందితులపై మొత్తం 185 కేసులు ఉన్నాయి. నిందితులు జేసీబీ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. నూతన టెక్నాలజీ, సీసీ కెమెరాల ద్వార శనివారం ఇద్దరు నిందితులు మహమ్మద్ అజారుద్దీన్, మహ్మద్ షాకీర్ గా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. మిగిలిన ముగ్గురు నిందితులు పరారీ లో ఉన్నారని త్వరలోనే వారిని పట్టుకుంటామని సీపీ తెలిపారు. నిందితుల నుంచి 272 కేజీ ల కాపర్ వైర్ , రూ.3,24,700, ఒక మోటార్ సైకిల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకొని ప్రాపర్టీ రికవరీ చేసిన విషయంలో కీలక పాత్ర వహించిన తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, తదితరులను అభినందించి నగదు రివార్డ్ అందజేశారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్



ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జహీరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శనివారం పట్టణంలోని 65వనెంబర్ జాతీయరహదారిపై పోలీసులు వాహనాల తనఖీలు చేపట్టడమైందన్నారు. టీఎస్15-ఈవై8945 నెంబరు గల పల్సర్ ద్విచక్రవాహనంపై ఎండి.ఫారూఖ్, అంజద్‌పాష, లహీక్‌లు బీదర్‌కు వెళ్తుండగా వారిని ఆపి తనఖీలు చేయగా వాస్తవాలు బహిర్గతమయ్యాయన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారంతా కర్ణాటకలోని బీదర్ ప్రాంతానికి చెందిన ఎండి.ఫారూఖ్, అంజద్‌పాష, లహీక్‌లుగ గుర్తించామన్నారు. గతంలో వీరందరు వివిధనేరాల్లో దొంగతనాలు, తదితరాలకు పాల్పడి జైలుకు వెళ్లొచ్చారని డీఎస్పీ తెలిపారు. వారివద్ద 13ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించడమైందన్నారు. వాటి విలువ సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందన్నారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య

రామయంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి ఓ వ్యక్తి చనిపోయాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం రామాయంపేటలో జరిగింది. పట్టణానికి చెందిన కుమ్మరి భూమయ్య (49) కూలి పని చేస్తుంటాడు. వచ్చే డబ్బులు సరిపోక పోషణ భారమైంది. దీంతో శుక్రవారం బాత్రూంలో గడ్డి మందు తాగి పడిపోయాడు. విషయాన్ని గమనించిన అతడి కుమారుడు నందు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించాడు. పరిస్థితి విషమించడంతో వైద్యులు కోంపల్లిలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. భూమయ్య చికిత్స పొందుతూ ఈ సాయంత్రం మరణించినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. మృతుడి భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



సత్యనారాయణ (ఫైల్)

మాసాయిపేట/గజ్వేల్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రెండు చోట్ల వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామ శివారు వద్ద జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండలం గంధమాల గ్రామానికి చెందిన సాక సత్యనారాయణ(42) గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంకులో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తన ద్విచక్ర వాహనంపై ప్రజ్ఞాపూర్ వెళ్లి రాత్రి కొడకండ్లకు వస్తుండగా మార్గమధ్యంలో రిమ్మనగూడ గ్రామ శివారు ఫ్లై ఓవర్ వద్ద హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం కొడకండ్ల అంబేద్కర్ సంఘం తరపున సత్యనారాయణకు ఘన నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ, బస్సు ఢీకొనడంతో..

మండలంలోని రామంతపూర్ గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం సాయంత్రం మండలంలోని రామంతపూర్ గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద జరిగింది. చేగుంట ఎస్సై చైతన్య కుమారు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణానికి చెందిన రాఘవేంద్ర (38) బైక్‌పై తూప్రాన్ వెళ్తుండగా వెనకాల నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొనగా అంతలోనే పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరోసారి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు, గాయపడిన రాఘవేందర్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే చనిపోయినట్లు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



శ్రీకాంత్ (ఫైల్)

రామాయంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పొలంలో గడ్డి కట్ చేస్తుండగా, మిషన్ కేబుల్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌తో ఓ యువరైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రామాయంపేటకు చెందిన గాయంతి శ్రీకాంత్(22) తన పొలం గట్టు వద్ద ఏపుగా పెరిగిన గడ్డిని మిషన్‌తో కట్ చేస్తున్నాడు. అతడు వినియోగిస్తున్న మిషన్ కేబుల్ తెగిన విషయాన్ని గమనించలేదు. వైరు కాలుకు తగలడంతో కరెంట్ షాక్ తగిలి పడిపోయాడు. తన తండ్రి రాజయ్య పలువురి సహాయంతో శ్రీకాంత్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.



సీఎంను సన్మానిస్తున్న ఆర్ కృష్ణయ్య, ప్రభుగౌడ్

సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన బీసీ నేతలు

సంగారెడ్డి రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఆర్డినెన్స్ జారీ చేసినందుకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ సీడీసీ చైర్మన్ పి. ప్రభుగౌడ్ తదితరులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

కేంద్రం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తోంది

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను వెంటాడి చంపేస్తుందని, ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ కేంద్ర ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, చంపేయడం అనేది ఏ చట్టంలోనూ లేదని స్పష్టం చేశారు. ఎన్‌కౌంటర్లపై జ్యుడిషియరీ ఎంక్వైరీకి ప్రభుత్వం ఎందుకు ఒప్పుకోవడం లేదని, వారి లోపాలు బయటపడతాయని అనుమానం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి వెళ్లాలని తమ నాయకులు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఈ నెల 16 న హుస్నాబాద్ పట్టణంలో సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, ఆగస్టు 18 నుంచి 22 వరకు రాష్ట్ర మహాసభలు జరుగుతాయని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్ తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేష్, జిల్లా నాయకులు జాగీర్ సత్యనారాయణగౌడ్, ఎడల వనేష్, కొమ్ముల భాస్కర్, శంకర్, కుమారస్వామి, గూడ పద్మ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు జేరిపోతుల జనార్దన్, జనగామ రాజ్‌కుమార్, గంబీరపు మధు, లక్ష్మణ్, వేల్పుల శ్రీనివాస్, సుదర్శనచారి, మల్లారెడ్డి, రజని తదితరులు పాల్గొన్నారు.

అధికారిక అనుమతి లేకుండానే పంచాయతీ భవనం ప్రారంభం!

శివ్వంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామంలో నూతన పంచాయతీ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. అయితే, ఈ భవనాన్ని అధికారికంగా అప్పగించకుండానే, హ్యాండ్ ఓవర్ సర్టిఫికెట్ ఇవ్వకుండానే, శిలాఫలకం ఏర్పాటు చేయకుండానే ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రారంభోత్సవానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు సైతం హాజరుకాలేదు. ఈ విషయమై ఆ అధికారులను సంప్రదించగా, భవనంలోని గదులలో బీమ్‌ల దగ్గర గ్రూ కటింగ్ సరిగా లేకపోవడంతో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయని చెప్పారు. అధికారికంగా భవనాన్ని అప్పగించలేదని స్పష్టం చేశారు. అధికారిక ప్రారంభోత్సవానికి శిలాఫలకం ఏర్పాటు చేస్తారని, గోడలకు ఏర్పడ్డ పగుళ్లను కాంట్రాక్టర్‌తో సరిచేయించిన తర్వాత, భవనాన్ని పూర్తిగా పరిశీలించి అప్పగించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్‌తో పాటు ముఖ్య నాయకులు ఎవరు హాజరవుతారనే సమాచారం తమ శాఖకు వస్తుందని, దానికి అనుగుణంగానే భవనాన్ని పూర్తిగా పరిశీలించి, హ్యాండ్ ఓవర్ లెటర్ అప్పగించి, శిలాఫలకం ఏర్పాటు చేసి అధికారికంగా ప్రారంభించి అప్పగిస్తామని అధికారులు వెల్లడించారు. చెన్నాపూర్‌లో ప్రారంభించిన భవనానికి తమకు సమాచారం లేకపోవడం వల్లే తమ శాఖ నుంచి ఎవరూ హాజరు కాలేదని, గోడలకు వచ్చిన పగుళ్లను మరమ్మతులు చేయిస్తామని అధికారులు పేర్కొన్నారు.

కవిత సంబరాలు చూసి నవ్వుకుంటున్నారు

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

ఝరాసంగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటిస్తే.. కల్వకుంట్ల కవిత రంగులు వేసుకొని సంబరాలు చేసుకోవడం చూసి నవ్వుకుంటున్నారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలో ఏర్పాటు చేసిన బీసీల ఐక్యత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలు గ్రామాల్లో నాయకులుగా ఉంటే సరిపోదని, రాష్ట్రానికి బీసీలు నాయకులు కావాల్సిన అవసరం ఉందన్నారు. రైతు భరోసా కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9 వేల కోట్లు అప్పు తీసుకువచ్చిందని, ఇందులో బీసీల అప్పు రూ.5.500 కోట్లు అన్నారు. తెలంగాణలో బీసీల జీవితాలు మారాలంటే కావాల్సింది రాజ్యాధికారమేనని అన్నారు. అసెంబ్లీల పునర్విభజనలో జహీరాబాద్ నియోజకవర్గం జనరల్ మహిళగా మారబోతోందని, ఇక్కడి నుంచి బీసీలు పోటీ చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్న టీం జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింహులు, బీసీ నాయకులు ప్రవీణ్, జ్యోతిపండ్యాల్, శంకర్, సంగన్న, నారయణ, ధన్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న కేతకీ సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు.



పచ్చదన పరవశం

కోహిర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహిర్‌లోని నారింజ వాగు పరివాహక ప్రాంతం వర్షాకాలంలో పచ్చని పంటలతో, గడ్డితో, చెట్లతో కనులపండువగా కనిపిస్తుంది. రైతులు తమ పొలాల్లో విత్తనాలు నాటడంతో పొలాలన్నీ పచ్చగా మారి నారింజ వాగు ప్రాంతానికి మరింత శోభను చేకూరుస్తున్నాయి. 65 వ జాతీయ రహదారి నుంచి కోహిర్ వరకు ఉన్న ప్రధాన రహదారి పక్కన ఈ ప్రాంతం ఉండటంతో, వాహనదారులు, ప్రయాణికులకు ఈ పచ్చని అందాలు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతాయి. ఈ మనోహర దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

నిరాశ్రయుల ఆదరణ

సండే స్పెషల్ Sunday Special

హెచ్ఐవీ బాధితులు, అభాగ్యులకు అండగా నిలుస్తున్న ఆదరణ సేవా సంస్థ

దాతల సహకారం లేకున్నా చేయూత

మెదక్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమాజ సేవకు అంకితమైన 'ఆదరణ' సేవా సంస్థ నిస్వార్థ సేవలకు మారుపేరుగా నిలుస్తోంది. హెచ్ఐవీ బాధిత వ్యక్తుల కోసం, అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నిరుపేదల కోసం దాతల సహాయం లేకున్నా వెనక్కి తగ్గకుండా, సొంత నిధులతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

ఆదరణ సేవా సంస్థ స్థాపకుడు శ్యాముల్, ఆయన సతీమణి ఆరోగ్య కార్యకర్త. 2018 లో రిజిస్టర్ అయిన ఈ సంస్థ, మొదట్లో కొంతమంది దాతల సహకారంతో సేవలను అందించేది. ప్రస్తుత పరిస్థితుల్లో నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మెదక్ పట్టణానికి చెందిన శ్యాముల్, సరైన వైద్య అవగాహన లేని పల్లెటూరి నిరుపేద, దళిత కుటుంబాలలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి ఆటోల్లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం, వారికి మెరుగైన వైద్య సదుపాయం అందించేలా కృషి చేయడం ఓ అలవాటుగా మారింది. అంతే



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు(ఫైల్)

కాదు, రోడ్డు పక్కన అనాథల్లా జీవిస్తున్న నిరాశ్రయులకు చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తుంటాడు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి తెచ్చి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంచుతుంటాడు.

ఆర్థిక కష్టాలున్నా ఆగని సేవా తపన

మెదక్, పాపన్నపేట, హవేళీఘనపురం మండలాల పరిధిలో సేవలందించే ఈ సంస్థ, నిధుల కొరత కారణంగా తమ సేవలను కుదించాల్సి వస్తోందని శ్యాముల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు క్రిస్మస్ పండుగ సందర్భంగా గ్రామీణ దళితులకు, వితంతువులకు కొత్త దుస్తులు పంపిణీ చేసేవాళ్లం. ఆ నిరుపేదల కళ్లలో ఆనందాన్ని చూస్తే ఎంతో తృప్తిగా ఉండేది.. అని శ్యాముల్ పాత రోజులను గుర్తు చేసుకుంటున్నాడు. సమాజంలో డబ్బున్న వారికి కొదవలేదు. వారు సహకరిస్తే ఇంకా ఎంతో మందికి సేవ చేయవచ్చు. కానీ ప్రస్తుతం దాతల సహాయం తగ్గిపోయింది. అయినా పేదరికంతో, వ్యాధులతో బాధపడేవారికి అండగా నిలవాలన్న తపనతో సంస్థను ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. ప్రస్తుతం శ్యాముల్ తన భార్యకు వచ్చే జీతంలో కొంత మేర డబ్బును పొదుపు చేసి సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. వారి వ్యక్తిగత కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సేవా దృక్పథంతో వెనక్కి తగ్గకుండా నిస్సహాయులకు భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

ప్రభుత్వ సహకారం ఉంటే..

ప్రభుత్వ సంస్థలు, దాతల సహకారం లభిస్తే సంస్థ సేవలను మరింతగా విస్తరించాలనే సంకల్పం ఉందని శ్యాముల్ తెలిపారు. సంస్థ ప్రారంభించిన మొదటి మూడు సంవత్సరాల పాటు మెదక్ పట్టణంలోని వ్యాపారులు, పలువురు ఉద్యోగులు మాకు సహకారం అందించేవారు. ఆ సమయంలో మా సేవలు మరింత విస్తృతంగా సాగాయని చెబుతున్నారు మానవతా దృక్పథంతో సహకారం అందించడానికి ముందుకు వస్తే, తమ సంస్థ కార్యకలాపాలను మరింత పెద్ద ఎత్తున విస్తరిస్తామని శ్యాముల్ తెలిపారు.



నిరాశ్రయుడికి దుప్పటి పంపిణీ చేస్తూ..(ఫైల్)

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి) : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి గెలుపునకు అనుకూలంగా మార్చుకోవాలన్నారు. ఓవైపు ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ, మరోవైపు పార్టీ పటిష్టతకు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందుతున్నాయన్నారు. ఆనంతరం పరిగి ఎమ్మెల్యే రాంమ్మోహనరావు, మాజీమంత్రి చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ధారాసింగ్, విద్యార్థినేత దయానంద్, మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్‌మహ్మద్ తన్వీర్, ఆయా మండలపార్టీల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, హన్మంతరావుపాటిల్, రాంలింగారెడ్డి, మక్సూద్, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్



క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

● మాజీ మంత్రి హరీశ్‌రావు

● సిద్దిపేటలో జాతీయ స్థాయి పోటీలకు హామీ

సిద్దిపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): పిల్లలను క్రీడల్లో పాల్గొని రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని సిటిజన్స్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడా జెండాను ఆవిష్కరించి, క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్రానికి, దేశానికి మంచి క్రీడాకారులను అందించినందుకు అభినందనలు తెలిపారు. సిద్దిపేటలో జాతీయ స్థాయి వాలీబాల్ సౌకర్యాలను మరింత మెరుగుపరుచుకుందామని, జూనియర్స్ లేదా సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి వాలీబాల్ ఈవెంట్‌ను సిద్దిపేటలో నిర్వహించాలని వాలీబాల్ అసోసియేషన్ సభ్యులను కోరారు. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటానని హామీ ఇచ్చారు.

దత్తగిరి ఆశ్రమంలో కర్ణాటక మంత్రి పూజలు



కర్ణాటక మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఝరాసంగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో శనివారం కర్ణాటక పర్యాటక శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ అర్చకులు వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలతో పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ మంత్రిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కూడా దత్తగిరి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి గాను ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ అవార్డులకు మంచి సృజనాత్మకత, అభ్యాస వాతావరణం, సాంస్కృతిక కళలు, సాహసం, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ సాంకేతికతతో పాటు ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన 5 నుంచి 18 సంవత్సరాల లోపు బాల బాలికలు అర్హులని, ఆసక్తిగలవారు ఈ నెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో (హెచ్‌టీపీపీ. అవార్డ్స్‌గోవ.ఇన్) దరఖాస్తు చేసుకుని, ఆ పత్రాలను కలెక్టర్ కార్యాలయంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

మహిళల ఉన్నతికి..

● ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ

● గ్రామీణ మహిళల జీవనోపాధికి ఊతం

● ఎస్‌బీఐ ఆర్‌సేటీ సహకారంతో నిర్వహణ

● హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



కంగ్టి, జూలై 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళల జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో ఐకేపీ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ-ఆర్‌సేటీ సహకారంతో 'ఉన్నతి' ద్వారా అందిస్తున్న కుట్టు శిక్షణ మంచి ఫలితాలను ఇస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వంద రోజుల పని పూర్తి చేసుకున్న, ఆసక్తి ఉన్న మహిళలను ఈ శిక్షణకు ఎంపిక చేశారు.

రూ.307 భత్యం..

కంగ్టి మండలంలో ఉన్నతి ద్వారా 20 మందిని ఎంపిక చేయగా, మరో 15 మంది 'నాన్-ఉన్నతి' కింద కుట్టు శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు ఎస్‌బీఐ-ఆర్‌సేటీ సహకారంతో ప్రతీ రోజు ఒక్కొక్కరికి రూ.307 భత్యంతో పాటు ఒక పూట భోజనం అందిస్తున్నారు. నాన్-ఉన్నతి మహిళలకు ఒక పూట భోజనంతో పాటు టైలరింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐకేపీ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లాలో వంద రోజుల ఉపాధిహామీ పనులు పూర్తి చేసుకున్న 300 మంది మహిళలను లక్ష్యంగా పెట్టుకున్నారు. నారాయణఖేడ్, కంగ్టి మండలాల్లో ఇప్పటివరకు 120 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో మహిళలకు బ్లౌజ్‌లు, నైటీలు, పంజాబీ షూట్స్, మిడ్డీలు, లాంగ్ ఫ్రాక్స్, యూనిఫామ్స్‌తో పాటు 30 రకాలపై కుట్టు శిక్షణ ఇస్తున్నారు. 30 రోజుల శిక్షణ పూర్తయ్యాక 15 రకాల పరికరాలు ఉండే కుట్టు కిట్‌ను అందిస్తారు. శిక్షణ పూర్తి చేసిన వారికి థర్డ్ పార్టీ ద్వారా పరీక్ష నిర్వహించి కేంద్ర ప్రభుత్వం ద్వారా ధ్రువపత్రాన్ని అందిస్తున్నారు. ప్రతిరోజు భత్యంతో పాటు భోజన వసతి కల్పిస్తూ కుట్టు శిక్షణ ఇస్తుండటం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఈ ఉన్నతి కుట్టు శిక్షణ వరంలా మారిందని చెప్పవచ్చు.

ఇలాంటి శిక్షణ చాలా అవసరం



మాది నిరుపేద కుటుంబం. రోజూ పనికి వెళితేనే పూట గడుస్తుంది. ఉపాధి పనికి వెళ్లే తాను కుట్టు శిక్షణకు వెళ్తానంటే ఇంట్లో ఎవరూ అంగీకరించలేదు. అయినా అందరినీ ఎదురించి వచ్చి నేర్చుకున్నా. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ శిక్షణ దోహదపడుతుంది.

- యశోద, బోర్గి

మహిళలకు మంచి అవకాశం



ఉన్నతి పేరిట ఐకేపీ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ సహకారంతో తమకు ఇస్తున్న కుట్టు శిక్షణ చాలా బాగుంది. భోజనంతో పాటు రోజుకు రూ.307 భత్యం చెల్లిస్తూ కుట్టు శిక్షణ ఇవ్వడం తమలాంటి పేద మహిళలకు వరం.

-అంబిక, కంగ్టి

300 మందికి శిక్షణ ఇవ్వడమే లక్ష్యం..



జిల్లాలో 300 మంది మహిళలకు ఉన్నతి ద్వారా కుట్టు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉపాధిహామీలో వంద రోజుల పని పూర్తి చేసుకున్న మహిళలకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎస్‌బీఐ సహకారంతో జిల్లాలో శిక్షణ శిబిరాలు కొనసాగిస్తున్నాం.

- సురేఖ, జేఆర్‌పీ

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నకోడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరులో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ చాంద్ పాషా శనివారం తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

●**రాయపోల్:** రాయపోల్ ఫీడర్ 11 కేవీ లైన్ల కింద ఉన్న చెట్లు తొలగించే నిమిత్తం మండల కేంద్రంలో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

కేజీబీవీలో కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జగదేవ్‌పూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి మాధవరెడ్డి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. హెడ్ కుక్‌కి 10వ తరగతి ఉత్తీర్ణత అసిస్టెంట్ కుక్‌కి 7వ తరగతి ఉత్తీర్ణతతో 18 నుంచి 45ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. అలాగే మోడల్ స్కూల్ అనుసంధాన గర్ల్స్ హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్ 2, వాచ్‌మెన్ 1, స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని 7వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 45 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు స్థానిక కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

మద్రాస్ ఐఐటీతో రాయపోల్ పాఠశాల ఎంఓయూ

రాయపోల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మద్రాస్ ఐఐటీ ఎంఓయూ కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించిన ఆమోద పత్రాన్ని పాఠశాలకు పంపించారు. దీంతో రాయపోల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్, సైన్స్ పాఠాలు ఆన్‌లైన్‌లో బోధించనున్నారు. మద్రాస్ ఐఐటీ వారికి హెచ్‌ఎం నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

దుబ్బాక, జూలై 12(ఆంధ్రజ్యోతి): దుబ్బాక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి మండలాలకు చెందిన 98మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ మేరకు రూ.35.20లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వెంట కూడవెల్లి రామలింగేశ్వరాలయ చైర్మన్ రాజిరెడ్డి, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ అధ్యమున్సిపాలిటీ అధ్యక్షుడు ఎసురెడ్డి, మండల అధ్యక్షుడు రవి, నాయకులు తదితరులున్నారు.

● **గజ్వేల్:** సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్ మండల దాతర్‌పల్లికి చెందిన బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కును ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి శనివారం అందజేశారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి

మిరుదొడ్డి, జూలై 12(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు తోటకమలాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి, ధర్మారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. వెంట నాయకులు అంజిరెడ్డి, సూకురి లింగం, బాల్‌రాజు, మల్లేశంగౌడ్, బైరయ్య, రమేష్, స్వామి, బాల్‌నర్సింలు, కుమార్, యాదగిరి రాజయ్య, ఎల్లం తదితరులున్నారు.

అలంకార ప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు

- అధికారుల నిర్లక్ష్యం.. చెత్తశుద్ధిలో అలసత్వం
- వృథాగా డంపుయార్డులు.. బహిరంగ ప్రదేశాల్లో చెత్తకుప్పలు
- ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో 20 షెడ్లు వినియోగానికి దూరం
- సేంద్రియ ఎరువుల తయారీ ప్రచారానికే పరిమితం





ధర్మారంలో నిరుపయోగంగా మారిన సెగ్రిగేషన్ షెడ్, సేకరించిన చెత్త బహిరంగ ప్రదేశంలో డంప్ చేసిన దృశ్యం

మిరుదొడ్డి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నుంచి సేకరించిన చెత్తతో గ్రామపంచాయతీలకు ఆదాయాన్ని సృష్టించేందుకు ఉద్దేశించిన సెగ్రిగేషన్ షెడ్ల ఏర్పాటు మండలంలో అలంకారప్రాయంగా మారడం పలు విమర్శలకు తావిస్తోంది. సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో ప్రచారానికే పరిమితమైంది. అధికారుల నిర్లక్ష్యం చెత్తశుద్ధిలో అలసత్వానికి కారణమవుతుందని పలువురు విమర్శిస్తున్నారు. రూ. లక్షలాదిగా ప్రజాధనం వృథా కావడంతో పాటు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి.

వృథాగా 20 షెడ్లు

ఇంటింటికీ తిరిగి సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించి, తడి, పొడి చెత్తగా వేరుచేసి ఆ వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేసేందుకు ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి మిరుదొడ్డి మండలంలోని 20గ్రామపంచాయతీల్లో నిర్మించిన ఈ షెడ్లను వినియోగంలోకి తీసుకునిరాకపోవడంలో నిరుపయోగంగా మారాయి. చెత్తను వేరుచేసేందుకు కంపార్ట్‌మెంట్లతోపాటు కంపోస్టు గదులను నిర్మించారు. సేకరించిన చెత్తతో ఎరువులు తయారుచేసి, ఆ ఎరువును రైతులకు విక్రయించి , గ్రామపంచాయతీలకు ఆదాయం కల్పించడంతోపాటు గ్రామాల్లో పారిశుధ్యం, స్వచ్ఛత మెరుగుపర్చవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీంతో లక్షలు వెచ్చించిన డంప్ యార్డులు వృథాగా మారాయి.

పట్టించుకోని అధికారులు

తడిచెత్త, కూరగాయలు, ఆహార వ్యర్థాలు, గడ్డి, పేపర్లు కంపోస్టు గదుల్లో వేరుగా చేసిన అనంతరం ఓ పద్ధతి ప్రకారం వాటిని ఎరువులుగా మార్చి విక్రయించాల్సి ఉంటుంది. సేంద్రియ ఎరువుల అమ్మకంతో గ్రామపంచాయతీలకు ఎంతో కొంత ఆదాయ వస్తుంది. అసలే నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న గ్రామపంచాయతీలు ఈ విధానంపై దృష్టి సారించడంలేదనే విమర్శలున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో అందుబాటులో ఉండే వనరుల నుంచి ఆదాయ సృష్టి అందని ద్రాక్షగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంపోస్టు ఎరువులను తయారీని చేయడంతో పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపనలున్నాయి. ప్రజలకు చెత్తను తడి, పొడి చెత్త వేరుచేయడంపై గతంలో అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టినప్పటికీ ఈ విషయంలో సిబ్బంది అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అందుబాటులో ఉన్న డంప్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లను సద్వినియోగం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్వాపూర్‌లో పడకేసిన పారిశుధ్యం



డ్రైనేజీలో చెత్త పేరుకుపోయి నిలిచిన మురుగునీరు

కోహెడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో పరిపాలన గాడితప్పింది. ప్రత్యేక అధికారులు పనుల ఒత్తిడితో పట్టించుకోకపోవడంతో పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకుంటున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఈ సమస్య కొట్టొచ్చినట్టు కనబడుతున్నది. గ్రామంలో ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్త, పారిశుధ్య లోపం రాజ్యమేలుతోంది. రెండు నెలలుగా మురుగు కాల్వలు శుభ్రపరిచే పరిస్థితి లేక మురుగు పూడిక పేరుకుపోయింది. వీధుల్లో దుర్వాసన వ్యాపించి ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలం మలేరియా, డెంగ్యూ కేసులు నమోదయ్యే అవకాశం ఉన్నా యంత్రాంగంలో కదలిక లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మురుగు ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ ఊసే లేదని గ్రామస్థులు వాపోతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు పట్టించుకొని పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



గాగిల్లాపూర్‌లో ఈత మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు, గౌడ సంఘం సభ్యులు



ములుగులో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మొక్కను నాటుతున్న అధ్యక్షుడు శ్రీనివాస్

బెజ్జంకి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గాగిల్లాపూర్‌లో గౌడసంఘం సభ్యులతో కలిసి ఈత మొక్కలను నాటారు. కార్యక్రమంలో హుస్నాబాద్ డివిజన్ ఎక్సైజ్ శాఖ అధికారులు, గౌడ సంఘం సభ్యులు ఉన్నారు.

● ములుగు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రతి ఒక్కరూ పర్యావరణ కోసం మొక్కలు నాటాలని గజ్వేల్ రోటరీక్లబ్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ములుగులో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సభ్యులతో కలిసి మొక్కలు నాటారు.

బీజేపీలో పలువురు నాయకుల చేరిక



నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మెదక్ ఎంపీ

గజ్వేల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీని కైవసం చేసుకుంటామని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ కి చెందిన ఆయా పార్టీల నాయకులు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సిద్ధమై ఉండాలని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన సత్తా చాటాలని సూచించారు. వెంట బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దేవుల పల్లి మనోహర్ యాదవ్, నాయకులు సింగం సత్తయ్య, నత్తి మల్లేశ్, సాయిబాబ, ఎల్కంటి సురేశ్, పంజాల అశోక్‌గౌడ్, కుమ్మరి నాగరాజ్ ఉన్నారు.


సాగునీటిని సత్వరమే విడుదల చేయాలి




గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నుంచి కూడవెల్లి, హల్దీ వాగులకు నీటిని విడుదల చేయాలని గజ్వేల్ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రస్తుతం నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొడకండ్ల వద్ద నీటిని కూడవెల్లి వాగులోకి, కొండపోచమ్మ సాగర్ నుంచి రామాయంపేట కెనాల్ ద్వారా హల్దీవాగులోకి నీటిని విడుదల చేయాలని లేనిపక్షంలో తామే వదులుతామని హెచ్చరించారు. వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ జడ్పీటీసీ రాంచంద్రం, నాయకులు తదితరులున్నారు. కాగా గజ్వేల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 48మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను గజ్వేల్ క్యాంప్ ఆఫీసులో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పంపిణీ చేశారు.

బీసీ బిల్లు అమలుపై కాంగ్రెస్ సంబురాలు





చేర్యాల మండలం ఆకునూరులో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం, హుస్నాబాద్‌లో సంబురాలు

చేర్యాల/హుస్నాబాద్/బెజ్జంకి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతంరిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు తదితరులున్నారు. బెజ్జంకిలో కాంగ్రెస్ నాయకులు బాణా సంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు.

బిల్లు చారిత్రాత్మక నిర్ణయం

మద్దూరు: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని మద్దూరు మండల కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సుందరగిరి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన మద్దూరులో విలేకరులతో మాట్లాడారు.

కాంగ్రెస్‌తోనే బీసీ లకు రాజ్యాధికారం

కొండపాక: బీసీలు రాజకీయ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు అన్నారు. వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్‌తో బీసీలు రాజకీయ అభివృద్ధి చెందుతారన్నారు.

ఘనంగా మహంకాళీ బోనాలు



దుబ్బాకలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

దుబ్బాక, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం బోనాలను పురస్కరించుకుని దుబ్బాకలోని రెడ్డి, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం మహంకాళీ బోనాలను ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధానవీధుల గుండా బోనాలను ఊరేగించి అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలోరెడ్డి, మున్నూరుకాపు సంఘం సభ్యులు ఉన్నారు.

గంభీర్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

దుబ్బాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో శనివారం దుబ్బాక శ్రీనివాస ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులకు వివిధ రకాల వైద్యపరీక్షలను నిర్వహించారు.

దర్గాలో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

కొండపాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కొండపాక మండలంలోని బందారం దర్గా గ్రామంలోని దర్గాలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, దర్గా నిర్వాహకులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

నంగునూరు: మండలంలోని గట్ల మల్యాల గ్రామ మాజీ సర్పంచ్ బుగ్గాలవ్వ ఇటీవల చెందింది. శనివారం మాజీమంత్రి హరీశ్‌రావు గ్రామానికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామానికి ఆమె హయాంలో చేసిన సేవలు మరువలేని అని కొనియాడారు. ఆమె కుమారుడు పార్టీ సీనియర్ నాయకుడు వీర్యానాయక్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్సీలకు 18శాతం కోటాను పెంచాలి



మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, జూలై12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీలకు 18శాత కోటాను పెంచాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం హైదరాబాద్‌లో ఎస్సీఎస్టీ, మైనార్టీశాఖ మంత్రి అడ్లూరీ లక్ష్మన్, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బీసీలకు 42శాతం కోటాను మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారని, అదేవిధంగా ఎస్సీలకు 18శాతం కోటాను పెంచాలని విన్నవించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకుని వెళ్తామని హామీఇచ్చినట్టు తెలిపారు.

ఈ పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్ల కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఈ పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోటి లింగాల ఆలయ ఆవరణలో ఈ పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నవీన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పూస స్వామి కుమార్, ఉపాధ్యక్షులుగా వేణుకుమార్, నాగరాజు, బాలకృష్ణా రెడ్డి, కోశాధికారిగా నర్సింలుతో పాటు మిగతా సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ 3 నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి



మురికి కాలువలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కమిషనర్ మల్లిఖార్జున్

బెజ్జంకి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండలంలోని బేగంపేట గ్రామాన్ని శనివారం ఎస్ఐ సౌజన్య సందర్శించి క్యూ ఆర్టీ పార్టీతో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో సామరస్యంగా ఎన్నికలు జరుపుకోవాలన్నారు. గ్రామంలో నంబరు ప్లేట్ లేని వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్థులకు సైబర్ నేరాల పై, సీసీ కెమెరాల ప్రాముఖ్యత గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌రావు, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజాన్ని తయారు చేద్దాం



డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ సందర్భంగా మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కొండపాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు డ్రగ్స్, గంజాయికి యువత దూరంగా ఉండాలని త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని బందారం గ్రామంలో గ్రామ యువత ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజాన్ని తయారు చేద్దామని పిలుపునిచ్చారు.

దేవాదుల ద్వారా రిజర్వాయర్లను నింపాలి



ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గోదావరి ప్రవహిస్తున్న నేపథ్యంలో దేవాదుల ద్వారా పంపింగ్ చేపట్టి జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లన్నింటిని పూర్తిస్థాయిలో నింపాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం దేవాదుల అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం దేవాదుల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వర్షాలు లేక ఇప్పటికీ జనగామ, చేర్యాల ప్రాంతాల్లో నాట్లు పూర్తిగా వేయలేదని, రైతాంగానికి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు మోటార్లు ఆన్‌చేసి సాగునీటినందించాలని కోరారు. నీరున్నా గత సీజన్‌లో పంపింగ్ చేయక పంట నష్టం చవిచూశారని, ప్రస్తుతం అలా కాకుండా రెండు, మూడుదశ పంపులు ఆన్‌చేసి నీటినందించి పంటలు కాపాడాలని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేసి చూపిస్తున్నాం



సిద్దిపేటలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేసిన పూజల హరికృష్ణ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 12: కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రజలకిచ్చిన మాట మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసి చూపిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని 14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆలకుంట మహేందర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లకు హరికృష్ణ, అత్తుఇమామ్ హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో పేరు రానివారు ఆందోళన పడవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ముద్దం లక్ష్మి, గయాజుద్దీన్, సన, రజిత, శ్రీకాంత్, రాకేష్, సాయిప్రతాప్ పాల్గొన్నారు.

'పాఠశాల పరిమళాలు' మాసపత్రికావిష్కరణ

చేర్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల రచనలతో రూపొందించిన పాఠశాల పరిమళాలు మాసపత్రికను శనివారం డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల ఆలోచనల ఆవిష్కరణకు దిక్సూచిగా పాటుపడటం అభినందించదగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రచ్చ కిష్టయ్య, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి బేతి భాస్కర్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాల తుది జాబితా విడుదల

మద్దూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని 6 ఎంపీటీసీ స్థానాలకు తుది జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రచురించినట్టు ఎంపీడీవో రాంమోహన్ తెలిపారు. మండల పరిషత్‌ల డీలిమిటేషన్‌లో భాగంగా మద్దూరు మండలంలోని కమలాయపల్లి, అర్జున్‌పట్ల గ్రామాలు చేర్యాల మండలంలోకి వెళ్లాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మద్దూరు మండలంలో 6 ఎంపీటీసీ స్థానాలకు తుది నోటిఫికేషన్ విడుదలైందన్నారు. నోటిఫికేషన్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ప్రచురించినట్టు తెలిపారు. గాగిల్లాపూర్ ఎంపీటీసీ పరిధిలో గాగిల్లాపూర్, నర్సాయపల్లి, వల్లంపట్ల, రేబర్తి ఎంపీటీసీ పరిధిలో రేబర్తి, వంగపల్లి, మద్దూరు ఎంపీటీసీ పరిధిలో మద్దూరు, సలాఖ్‌పూర్ ఎంపీటీసీ పరిధిలో సలాఖ్‌పూర్, మర్మాముల ఎంపీటీసీ పరిధిలో మర్మాముల, లద్నూరు ఎంపీటీసీ పరిధిలో లద్నూరు, ధర్మారం గ్రామాలుంటాయని తెలిపారు.

'ఆపన్నహస్తం' సేవలు అభినందనీయం



గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సైదా

గజ్వేల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'ఆపన్నహస్తం' మిత్రబృందం సేవలు అభినందనీయమని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన పలువురు మిత్రబృందంగా ఏర్పడి ఆపన్నహస్తం సేవాసంస్థ పేరిట వంద సహాయ కార్యక్రమాలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణంలో సదరు సేవాసంస్థకు చెందిన మిత్ర బృందం కుటుంబసభ్యులతో కలసి ముఖ పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ సీఐ సైదాతో పాటు లోకసత్తా ఉభయ రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆపన్నహస్తం సేవలను కొనియాడారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి, భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిత్ర బృందం అధ్యక్షుడుపాశికంటి బాల్‌చంద్రం, గజ్వేల్ శిశుమందిర్ ప్రిన్సిపాల్ హరిణి, దేశబోయిన నర్సింలు, మిత్రబృందం ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యాంప్రసాద్, సహాయ కార్యదర్శి కొలిచెలిమి స్వామి, సభ్యులు తదితరులున్నారు.